సాక్షి
శ్రీకాకుళం
శనివారం ౹ 19 ౹ జూలై ౹ 2025



వీడిన గ్రహణం

డిగ్రీ ప్రవేశాలకు గ్రహణం వీడింది. రెండు నెలల జాప్యం తర్వాత ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. - 8లో



ఎన్నాళ్లీ రహ'దారి'ద్ర్యం..?

రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వజ్రపుకొత్తూరు మండలం దారులు దారుణంగా ఉన్నాయి. - 8లో



వేర్వేరు చోట్ల చోరీలు

జిల్లాలో వేర్వేరు చోట్ల చోరీలు జరిగాయి. ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఆశ్రమ పాఠశాలల పరిశీలన



బొమ్మిక ఆశ్రమంలో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

పాతపట్నం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లాబర, బొమ్మిక ఆశ్రమ పాఠశాలలను పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ప్రతి రోజు శుభ్రం చేయాలన్నారు. విద్యార్థులకు తాగడానికి వేడి నీరు అందించాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ప్రధానోపాధ్యాయులు త్రినాథ రావు, సూర్యనారాయణలకు సూచించారు. ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీఈఈ బి.సిమ్మన్న, జేఈ సీహెచ్ ప్రసాద రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అర్జీలపై చర్యలు చేపట్టాలి: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వచ్చిన అర్జీలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెడ్పీ సీఈఓ, విభిన్న ప్రతిభావంతుల ఇన్‌చార్జి సహాయ సంచాలకులు ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజాను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలు తెలియజేయాలన్నారు. బ్యాటరీ సైకిల్ కోసం, సదరం సర్టిఫికెట్, పింఛన్లు, హౌసింగ్, ఉపాధి, వినికిడి మిషన్ లపై 17 అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ఉద్యోగుల గ్రీవెన్స్‌పై ఏపీ ఎన్జీఓ నాయకులు హెచ్.సాయిరాం కారుణ్య నియామకాలు, ఉద్యోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో కొన్నింటికి మాత్రమే వైద్యం జరుగుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ, విభిన్న ప్రతిభావంతులు శాఖ ఇన్‌చార్జి ఏడీ ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజా స్వీకరించారు.

45.355 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాల నిలుపుదల



ఎరువుల గోడౌన్‌లో తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారుల బృందం

కంచిలి: కంచిలిలో గల శ్రీ భగవాన్ గుప్తా అండ్ కో రిటైల్ ఎరువుల దుకాణంలో జీఎస్టీలో పొందుపర్చని 45.355 మెట్రిక్ టన్నులు అనగా రూ.7.15 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ జిల్లా విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్, వ్యవసాయ అధికారుల బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టింది. ఈ తనిఖీల్లో ఎరువుల అదనపు గోడౌన్స్‌ను జీఎస్టీలో పొందుపరచలేదని గుర్తించారు. గోడౌన్లో ఎరువులు నిల్వ చేయడానికి వీలుగా నేలపై ఊకను వేయాలని తెలియజేసి, జీఎస్టీ పరిధిలోకి రాని ఆ గోడౌన్‌లో ఉన్న ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. వచ్చిన వారిలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి. విజయ ప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ డిపార్టుమెంట్ ఆడారి సంతోష్‌కుమార్, స్థానిక మండల వ్యవసాయ అధికారి కొంకేణ సురేష్, డీఏఓ ఆఫీస్ నుంచి హాజరైనటువంటి వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరావు, వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్ ఉన్నారు.

వంశధార సాగునీరు సాధన కమిటీ పర్యటన

మందస: మందస మండలం దేవపురం గ్రామంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం జరిగింది. సాగునీటి నిల్వ కోసం రైతులు చాలా ఇబ్బందుల పడుతున్నారని, చెరువును కలుపుకుని సంకు జోడి దామోదర్ గ్రావిటి ద్వారా నీరు అందించవచ్చునని అన్నారు. గ్రామ రైతులు వంశధార సాగునీరు సాధన కమిటీకి తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు.

హాల్‌మార్క్ ప్యూరిటీ.. లేదు ష్యూరిటీ..!

- జిల్లాలో గోల్డ్ మోసాలు
- సొంత మిషన్లతో అనుమతి లేకుండా హాల్‌మార్క్ సెంటర్ల ఏర్పాటు
- వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్‌తో ఆభరణాలపై ముద్ర
- బయటపడకుండా పక్కాగా మోసం
- నరసన్నపేటలో వెలుగుచూసిన మోసంతో ఉలిక్కిపడిన జిల్లా వాసులు





నరసన్నపేటలోని ఓ టెస్టింగ్, హాల్‌మార్క్ సెంటర్‌లో నకిలీ హాల్‌మార్క్ వేసేందుకు వినియోగించిన లేజర్ మిషన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో బంగారం మోసాలు గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నాయి. నాణ్యతకు మారుపేరుగా భావించే హాల్‌మార్క్‌పైనే నకిలీ మకిలి పడుతోంది. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి హాల్‌మార్క్ ఉన్న తన పాత బంగారం ఆభరణాన్ని ఇచ్చేసి, కొత్త ఆభరణం తీసుకుందామని విశాఖలోని ఓ ప్రముఖ కార్పొరేట్ జ్యూయలరీ షాపు వద్దకు వెళ్లారు. వారు అన్నీ పరిశీలించి 75 శాతం మాత్రమే ప్యూరిటీ ఉందని చెప్పారు. హాల్‌మార్క్ ఉన్నప్పటికీ 25 శాతం కోల్పోవాల్సి వచ్చింది. జిల్లాలో జరుగుతున్న బంగారం మోసాలకు ఇదో మచ్చుతునక. జిల్లాలో హాల్‌మార్క్ ఉన్నప్పటికీ మోసపోతున్న వాళ్లు చాలా మంది ఉన్నారు. పాత బంగారం కొనుగోలు చేసిన షాపు దగ్గరికి వెళ్లి అడిగితే అబ్బే మాకేం సంబంధం లేదు.. ఆ వస్తువు మా దగ్గర కొనలేదని దాటేసే పరిస్థితులు ఉన్నాయి. విక్రయించినప్పుడు చెప్పిన మాటలు తర్వాత ఉండటం లేదు. వీరి వల్ల నిజాయితీగా వ్యాపారం చేసే వ్యాపారులకు సైతం మచ్చ పడుతోంది.

జిల్లాకే చెడ్డపేరు..

బంగారం వ్యాపారానికి నరసన్నపేట ప్రసిద్ధి గాంచింది. మొదటి నుంచి క్వాలిటీ బంగారం దొరకదని పేరు ఉంది. ముఖ్యంగా దొంగతనం బంగారం, నాణ్యత తక్కువ ఉన్న ఆభరణాలు, ట్యాక్స్ చెల్లించని బంగారం విక్రయిస్తుంటారన్న అపవాదు ఉంది. అదే రకంగా నమ్మకంతో వ్యాపారం జరుగుతున్న పరిస్థితి కూడా ఉంది. కొంతమంది క్వాలిటీ బంగారం విక్రయించి, కస్టమర్లను ఆకర్షించి భారీ ఎత్తున వ్యాపారం కూడా చేస్తున్నారు. కానీ నరసన్నపేట గోల్డ్ బిజినెస్‌కు అధికారికంగా నకిలీ మకిలి పట్టింది. కొందరు వ్యాపారులు చేసే అడ్డగోలు, మోసపూరిత వ్యాపారంతో ఆ ప్రాంతానికే కాదు జిల్లాకే చెడ్డ పేరు వచ్చేసింది. ఇప్పుడు బంగారం కొనుగోలు చేయాలంటే భయపడే పరిస్థితి వచ్చేసింది.

నరసన్నపేటలో నకిలీ హాల్‌మార్క్‌తో దొరికిన బంగారం వ్యవహారం దాదాపు జిల్లా వ్యాప్తంగా ఉంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఈ రకమైన మోసం జరుగుతోంది. బీఐఎస్ అధికారులు తనిఖీల విషయం తెలుసుకుని ముందుగా అప్రమత్తమై చాలా మంది షాపులు మూసేయడంతో తప్పించుకున్నారు. లేదంటే అక్కడ మరికొన్నిచోట్ల మోసాలు బయటపడేవి. ఆ సమాచారం బీఐఎస్ అధికారుల వద్ద కూడా ఉంది. అదే విధంగా శ్రీకాకుళంలో కూడా నకిలీ హాల్‌మార్క్ మోసాలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్టు సమాచారం ఉంది.

పెద్ద మోసమే..

జిల్లాలో బంగారం క్రయవిక్రయాలు నరసన్నపేట, శ్రీకాకుళంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. హాల్‌మార్క్ వేసే సెంటర్లు అధికారికంగా ఆరు వరకు ఉన్నాయి. బీఐఎస్ హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ మార్క్ ఉన్న బంగారం ఆభరణాలకు వాస్తవంగా తిరుగుండదు. మోసపూరిత బంగారం కాదని నిర్ధారించుకోవచ్చు. ఆభరణం మీద ఉన్న హెచ్‌యూఐడీ నంబర్‌ను గూగుల్‌లో కొడితే చాలు అందులో ఎంత బంగారం ఉంది? ఎక్కడ హాల్‌మార్క్ వేశారు? వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. నరసన్నపేటలోని జీఎస్ఆర్ బంగారం షాపులో ఈ హాల్‌మార్క్ ముసుగులో జరిగిన మోసం బయటపడింది. హాల్‌మార్క్ లేకుండా కూడా బంగారం విక్రయిస్తున్నట్టు వెలుగు చూసింది. దాదాపు 1072.45గ్రాముల బంగారాన్ని విజయవాడ నుంచి వచ్చిన బీఐఎస్ అధికారుల బృందం సీజ్ చేసింది. హాల్‌మార్క్ లేకుండా విక్రయిస్తున్న బంగారంతో పాటు నకిలీ హాల్‌మార్క్‌తో ఉన్న బంగారం కూడా గుర్తించారు. ఈ నకిలీ హాల్‌మార్క్ వేయడానికి అక్కడొక సెంటర్ కూడా ఏర్పాటైంది. అనుమతి లేకుండా ఏర్పాటైన శ్రీలక్ష్మీ గోల్డ్ టెస్టింగ్ అండ్ హాల్ మార్క్ సెంటర్‌లో నకిలీ హాల్ మార్క్ వేస్తున్న పరిస్థితి బయటపడింది. దీన్ని కూడా సీజ్ చేశారు.

మోసం చేసిందిలా..

శ్రీలక్ష్మీ గోల్డ్ టెస్టింగ్ అండ్ హాల్ మార్క్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న లేజర్ మిషనరీతో నకిలీ హాల్‌మార్క్ వేస్తున్నారు. ఆ నకిలీ హాల్‌మార్క్ బయటపడకుండా ఉండేందుకు నెట్‌లో ఉన్న వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్లు వినియోగిస్తున్నారు. సాధారణంగా హెచ్‌ఐయూడీ నంబర్‌ను గూగుల్ సెర్చ్ చేస్తే మొత్తం వివరాలన్నీ వచ్చేస్తాయి. ఆ రకంగా వెలుగు చూడకూడదని వేరే వారి హెచ్‌ఐయూడీ నంబర్‌ను ఉపయోగించి, సొంతంగా ఏర్పాటు చేసుకున్న మిషన్‌తో హాల్‌మార్క్ వేసి, వ్యాపారం సాగించేస్తున్నట్టుగా తేలింది.


హాల్‌మార్క్‌ను నమ్మకూడదా..?



నరసన్నపేటలో వెలుగు చూసిన మోసంతో బంగారం ఆభరణాలపై హాల్‌మార్క్ ఉన్నా నమ్మడానికి లేదని స్పష్టమవుతోంది. ఆ హాల్‌మార్క్ ఎంత వాస్తవమో తెలుసుకోవడానికి మరో కేంద్రం వద్ద టెస్టింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా హాల్‌మార్క్ ఉంటే బంగారానికి తిరుగులేదు అనుకుంటారు. ప్యూరిటీ ఉన్న బంగారంగా భావిస్తారు. నకిలీ టెస్టింగ్ అండ్ హాల్ మార్క్ సెంటర్ల ఏర్పాటుతో ఏది సరైన హాల్ మార్క్, ఏది నకిలీ అని తెలుసుకోలేని పరిస్థితులు ఉండటంతో కొనుగోలు దారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వినతులు విన్నారా..?

- గడువు ముగిసినా పరిష్కారం కాని రైతుల సమస్యలు
- సర్వేయర్లు, వీఆర్‌ఓలకు కాసుల పంట
- 22ఎలకు ఇదే పరిస్థితి
- ఆన్‌లైన్‌లో పేరుకుపోతున్న అర్జీలు



శ్రీకాకుళం పాతబస్టాండ్:

భూ వినతులు బుట్ట దాఖలవుతున్నాయా..? అర్జీలు ఉన్నతాధికారుల వరకు చేరడం లేదా..? విన్నపాలు విని ఊరుకుంటున్నారా..? జిల్లాలో పరిస్థితి చూస్తే ఔననే సమాధానం వినిపిస్తోంది. రైతులు ప్రతి నిత్యం భూ సమస్యలతో సతమతమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా మంది ప్రభుత్వం అందించే ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ఉన్నతాధికారులు ప్రతి నెల డివిజన్‌ల వారీగా ఆర్ఓఆర్ సమావేశాలు నిర్వహించి, ఆదేశాలు, ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

ఆ రెండు సమస్యలే ప్రధానం..

రైతులను ప్రధానంగా రెండు సమస్యలు వేధిస్తున్నాయి. ఇందులో ఒకటి జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్), మరొకటి 22ఎ జాబితాల్లో జిరాయితీ భూమి నమోదు. ఈ సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదుల్లో సగం వరకు ఈ తరహా వినతులే వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సదస్సులు, ప్రజా దర్బార్లు నిర్వహించినా వీరి సమస్యలకు మాత్రం పరిష్కారం దొరకడం లేదు.

అన్నీ పెండింగే..

జిల్లాలో 735 రెవెన్యూ గ్రామాల్లో పెండింగ్‌లో 12,245 జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నాయి. వీటిని పరిష్కారానికి జూన్ 30 వరకు గడువు ఇచ్చారు. కేవలం రూ.50 తీసుకుని ఈ ఎల్‌పీఎంల సమస్య లు పరిష్కరించాలని అధికారులు గడువు పెట్టారు. ఈ కాలంలో కనీసం పదో వాటా కూడా సమస్యలను పరిష్కరించలేదు. ప్రస్తుతం రైతులు ఎల్‌పీఎంలను మార్చుకోవాలంటే రూ.550లు చెల్లించి చలా నా తీయాలి. దీంతో సర్వేయర్ మళ్లీ పొలం వద్దకు వస్తారు. ఆయనతో పాటు వీఆర్‌ఓ, అవసరాన్ని బట్టి మండల సర్వేయర్ కూడా పొలాన్ని సందర్శించాక ఈ ఎల్‌పీఎం విభజన ప్రక్రియ ప్రారంభమవుతుంది. అయితే ఈ పనులు జరగాలంటే కనీసం ఆ భూమి ఉన్న ప్రదేశం, విలువ, ఎల్‌పీఎం నంబర్లు బట్టి సర్వేయర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.5వేలు వరకు ముట్టజెప్పాల్సి వస్తోంది. జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ఈ ధర రెట్టింపు ఉంటుంది. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో 308 గ్రామాల్లో 7358 జాయింట్ ఎల్‌పీఎంలు, టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో 213 గ్రామాల్లో 2686, పలాస రెవెన్యూ డివిజన్‌లో 214 గ్రామాల్లో 2201 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 735 గ్రామాల్లో రీ సర్వే చేశారు. ఈ క్రమంలో గ్రామ స్థాయిలో సర్వేయర్లు ఫీల్డ్ వర్క్‌ను విస్మరించి, టేబుల్ వర్క్‌లు చేయడంలో రైతుల వివరాలు తప్పుగా నమోదయ్యాయి. దీంతో రైతుకు అవస్థ తప్పడం లేదు.

రోజూ 22ఎ సమస్యలే..

జిల్లా వ్యాప్తంగా 22ఎ సమస్యలు రైతులను వేధిస్తు న్నాయి. వారసత్వంగా వస్తున్న జిరాయితీ భూము ల 'పహణీ' మార్పులు జూన్‌లో జరుగుతాయి. ఈ సమయంలో వీఆర్‌ఓలు వీటిలో చాలావరకు జిరాయితీ భూములను 22ఎలకి మార్పు చేస్తున్నారు. 22ఎ జాబితా నుంచి మళ్లీ జిరాయితీగా మార్చాలంటే జాయింట్ కలెక్టర్ అనుమతి ఉండాలి. ఈ ప్రక్రి య సర్వేయర్, వీఆర్‌ఓతో ప్రారంభమై మండల సర్వేయర్, తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయం, కలెక్టరేట్ ఈ సెక్షన్, తర్వాత జాయింట్ కలెక్టర్ వరకు చేరాలి. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కలెక్టరేట్ ఈ సెక్షన్‌లో 22ఎ కి సంబంధించి దరఖాస్తులు 34 ఉన్నాయి. వీటిలో సోంపేట, మందస, నందిగాం, పలాస, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో ఎక్కువగా ఉన్నాయి.

జిరాయితీని 22ఎలో పెట్టేశారు



మాకు వారసత్వంగా తాతల నుంచి వచ్చిన జిరాయితీ భూమిని 22ఎ లో పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. కావాలనే వీఆర్‌ఓ ఇతర రెవెన్యూ అధికారులు మాకు సమస్యలను సృష్టిస్తున్నారు. సరి చేయాలని దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదు. వారి తప్పు వల్ల నేను పని మానుకుని శిక్ష అనుభవిస్తున్నాను.

– అన్నెపు శ్రీనివాసరావు, చింతాడ

విస్తీర్ణంలో మాయచేశారు



నాకు చింతాడ రెవెన్యూ నందరిగిపేటలో 112లో 17,18,19 సర్వే నంబర్లులో 0.20 సెంట్ల జిరాయితీ భూమి ఉంది. ఆ భూమికి రెవెన్యూ రికార్డులో విస్తీర్ణం చూపించడం లేదు. దీని కోసం సర్వేయర్, వీఆర్‌ఓను ఎన్నిసార్లు కలిసినా తమ పరిధిలో లేదంటున్నారు. గతంలో ఉన్న విస్తీర్ణం ఎలా మాయమైంది..? ఇలాంటి సమస్యలపై ఎందుకు ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

– పొతిన రామారావు, చింతాడ రెవెన్యూ, నందగిరిపేట


భూ రికార్డులు తారుమారు



మాకు మా అమ్మ పేరిట చింతాడ రెవెన్యూలో రెండు ప్రతులు రెండు సర్వే నంబర్లలో సుమారుగా 1.26 సెంట్లు జిరాయితీ భూమి ఉంది. ఇందులో 0.52 సెంట్ల జిరాయితీ భూమి తప్పుగా మరొకరి పేరిట నమోదు చేశారు. అలాగే 0.74 సెంట్లు జిరాయితీ భూమిని 22ఎలో పెట్టారు. ఈ రెండు సమస్యలను పరిష్కరించాలని తిరుగుతూనే ఉన్నాను. ఫలితం లేదు.

– సనపల శ్రీనివాసరావు, చింతాడ, సనపలవాని పేట

సైబీరియా నుంచి.. తేలుకుంచి



తేలుకుంచి 'కొంగొత్త అందాలు సంతరించుకుంటోంది. తొలకరి మబ్బుల వెంట వేలాదిగా పక్షులు సైబీరియా నుంచి తేలుకుంచికి వలస వస్తున్నాయి. ఇక్కడి చెట్టుతో జట్టు కట్టడం, ఈ నేల రుచిని ఆస్వాదించడం, ఈ గాలిలో విహరించడం.. శతాబ్దాలుగా ఈ అతిథి విహంగాలకు అలవాటు. కానీ ఏడాది గూడు పెట్టేందుకు చెట్లు కరువవుతున్నాయి. గడ్డివాములు, ఇళ్లపై గూళ్లు పెట్టాల్సి వస్తోంది.

- చెట్లపై సందడి చేస్తున్న విదేశీ విహంగాలు
- అరకొర చెట్లు ఉండడంతో గుడ్లు పెట్టేందుకు పాట్లు
- పట్టించుకోని అటవీ శాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్:

వేల కిలోమీటర్ల నుంచి అతిథి పక్షులు తేలుకుంచి చేరిపోయాయి. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు చిత్ర విచిత్రమైన కూతలతో చెట్లపై సందడి చేస్తున్నాయి. ఏటా తొలకరి జల్లులు కురిసే జూన్ మాసాంతరానికి వచ్చే పక్షులు ఈ ఏడాది కూడా ఏతెంచాయి.

కొమ్మకొమ్మకు పురిటి కేంద్రాలు

చెట్లపై కొమ్మలు, రెమ్మలు ఉంటే తప్ప గూడు ఏర్పాటు చేసుకోలేని ఈ పక్షులు గుడ్లు పెట్టేందుకు గ్రామం చుట్టూ ఉన్న చెట్లనే ఆశ్రయిస్తుంటాయి. ఒక్కో పక్షి రెండు నుంచి ఆరు గుడ్లు వరకు పెడుతుంటాయి. సుమారు 27 నుంచి 30 రోజుల వరకు తల్లి పక్షి గుడ్లను పొదుగుతుంది. పొదిగిన రోజు నుంచి 36 రోజుల పాటు ఆహారాన్ని తీసుకువచ్చి అందించి పిల్ల పక్షులను సంరక్షిస్తాయి. పిల్ల పక్షులకు శక్తి వచ్చి ఎగిరేంత వరకు తల్లి పక్షి లేదా మగ పక్షి గూళ్లో వీటికి కాపలాగా ఉంటాయి.

స్థానికులతో అనుబంధం

ఎక్కడో సైబీరియా నుంచి ఇక్కడి వరకు వచ్చే పక్షులకు అసలైన బంధువులంటే ఈ గ్రామ వాసులే. ఈ గ్రామస్తులతో పక్షులకు విడదీయలేని అనుబంధం ఉంది. పక్షుల రాక ఏ మాత్రం ఆలస్యమైనా కంగారుపడిపోతారు. ఇవి వస్తేనే వానలు కురుస్తాయని ఇక్కడి వారి నమ్మకం. తాము కూర్చున్న చోట, పక్కనే వాలుతాయని, వీటిని వేటగాళ్ల బారినుంచి తామే రక్షిస్తుంటామని చెబుతున్నారు. ఒకవేళ ఎవరైనా పక్షులకు హాని తలపెట్టాలని చూస్తే గ్రామ కట్టుబాటు ప్రకారం ఆ వ్యక్తికి గుండు గీయించి ఊరేగిస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇవే ప్రత్యేకతలు

- వీటి అసలు పేరు ఓపెన్ బిల్ స్టార్క్స్. వీటి శాస్త్రీయ నామం 'అనస్థోమస్'.
- ఈ పక్షులు తూర్పు–దక్షిణాసియా ఖండంలో ముఖ్యంగా భారతదేశం, శ్రీలంక నుంచి మొదలుకొని తూర్పు ప్రాంతంలో విస్తారంగా సంచరిస్తుంటాయి.
- వీటి జీవిత కాలం సుమారు 30 ఏళ్లు.

విడిది ఏదీ..?

గతంలో వచ్చిన వరుస తుఫాన్ల తీవ్రతకు ఇక్కడ చాలా చెట్లు నేలకొరిగాయి. 2018లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు వందలాది పక్షులు మత్యువాత పడ్డాయి. ఈ ఏడాది వందల సంఖ్యలో పక్షులు వస్తున్నాయి. ప్రస్తుతం పక్షులు గూళ్లు పెట్టేందుకు నానాపాట్లు పడుతున్నాయి. చెట్లు లేక గడ్డికుప్పలు, ఇళ్లపై, పంట పొలాల చాటున గూళ్లు పెట్టుకునేందుకు సిద్ధపడుతున్నాయి. రాత్రి సమయాల్లో విష పురుగులు బారిన పడి పక్షులు మృతి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




మూలకు చేరిన పక్షుల చికిత్సాలయం

- బాగా ఎదిగిన పక్షి 81 సెంటీమీటర్ల పొడవు, 11 కిలోల బరువు ఉంటుంది. రెక్కలు విప్పారినప్పుడు 149 సెంటీ మీటర్ల వరకు ఉంటుంది.
- దవడల మధ్యన (ముక్కు మధ్యలో) ఖాళీ ఉండటం వల్ల వీటిని ఓపెన్ బిల్ స్టార్క్స్ అని అంటారు.
- పగలంతా తంపర భూముల్లో, వరి చేలల్లో తిరుగుతూ చేపలు, నత్తలు, కప్పలు, పురుగులు, ఆల్చిప్పలను ఆహారంగా తీసుకుంటాయి.

సంరక్షణ గాలి..


పక్షులను సంరక్షించాల్సిన అటవీ, పర్యావరణ శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో చెట్లు పెంచాల్సిన అటవీ శాఖ సిబ్బంది జాడే లేకుండా పోయింది. ఏడాదికో మారు గ్రామంలో చిన్నపాటి సమావేశాలు పెట్టి ఫొటోలు తీసి వెళ్లిపోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ గతంలో పర్యాటక శాఖ అధికారులతో పర్యటించి రూ.25లక్షలతో సుమారు ఎకరా దేవదాయ భూమిలో ప ర్యాటక కేంద్రాన్ని నిర్మిస్తానంటూ హామీ ఇచ్చి పదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నెరవేరలేదు.

పర్యాటకులకు నిరాశే



ఏటా విదేశీ పక్షులు మా ప్రాంతం తేలుకుంచి వస్తుండటం చాలా ఆనందంగా ఉంది. అయితే ఈ పక్షులను వీక్షించేందుకు నాలాంటి పక్షి ప్రేమికులకు నిరాశే ఎదురవుతోంది. ఈ పక్షుల సరంక్షణను ప్రభుత్వం గాలికి వదిలేసినట్లు ఉంది. పర్యాటకులకు సదుపాయాలు కల్పిస్తే చాలా బాగుంటుంది. – దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, సోంపేట

పక్షుల విహార కేంద్రానికి ప్రయత్నం



తేలినీలాపురం మాదిరి తేలుకుంచిలో పక్షుల విహార కేంద్రం నెలకొల్పేందుకు సుమారు రూ.పది లక్షల అంచనాతో గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. గ్రామంలో మొక్కలు నాటేందుకు గ్రామస్తులు సహకరించడం లేదు. పక్షుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. – ఎ.మురళీకృష్ణంనాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కాశీబుగ్గ అటవీశాఖ

'కనీస వేతనం రూ. 26 వేలు అందించాలి'



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, కార్మికులు

ఆమదాలవలస: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా, పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమంలో నిరసన తెలిపి నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిలిపివేయాలని కోరారు. తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు కాంట్రాక్ట్ కార్మికులకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. ధర్నాలో ఏపీ మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయీస్ ఫెడరేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, నాయకులు జె.శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, కె. ధనలక్ష్మి, ఎస్.రమ, కె.ఈశ్వరరావు, కె.నీలమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇల్లు పేరిట రూ.10 లక్షలకు టోకరా

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఓ ఫ్లోర్ ఇంటిని అమ్ముతానంటూ ఓ మహిళా బ్యాంకు ఉద్యోగిని రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పీఎన్‌కాలనీకి చెందిన రొక్కం సాహితీ కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. 2023లో ఇదే కాలనీకి చెందిన సిల్లా శ్రీనివాసరావుకు తన పేరున ఉన్న ఫ్లోర్‌ను రూ.90 లక్షలకు అమ్మేందుకు బేరం కుదుర్చుకున్నారు. ఈ మేరకు తండ్రి వెంకటేశ్వరరావు, భర్త సుధీర్‌లే కాక యూఎస్‌కు చెందిన మధ్యవర్తి ఒకరు, భద్రారావు సమక్షంలో అగ్రిమెంట్ అయ్యింది. ముందుగా రూ.10 లక్షలు ఇచ్చి మిగతాది కొన్నిరోజుల వ్యవధిలో ఇచ్చేందుకు బాండ్‌పేపర్ రాసుకున్నారు. ఈ మేరకు డబ్బులు ఏర్పాటుచేసుకున్న శ్రీనివాస్ రిజిస్ట్రేషన్ చేసుకుందామని సాహితిని పిలిస్తే ఎప్పుడూ దాటవేసేదని.. పలువురి వద్ద ఆరా తీయగా అదే ఫ్లోర్‌పై బ్యాంకు రుణాలే కాక కొంతమంది వద్ద అప్పులకు తనఖాగా రాసినట్లు తెలిసిందన్నారు. అదే ఫ్లోర్‌ను కృష్ణమూర్తి అనే వ్యక్తి ఆక్రమించుకున్నట్లు తెలిసి వెళ్లి అడిగితే తనకూ చాలా డబ్బులు సాహితీ ఇవ్వాల్సివుందని శ్రీనివాసరావు వద్ద చెప్పారు. దీంతో శ్రీనివాసరావు తన డబ్బులు ఇమ్మని సాహితీని కోరగా భర్త సుధీర్ బెదిరించడంతో చేసేది లేక మంగళవారం రాత్రి పోలీసులను ఆశ్రయించాడు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఇతరులెవ్వరూ తమకు ఫిర్యాదుచేయలేదని సీఐ చెప్పారు.

పనివేళలు మార్చాలని వినతి



పీడీ,పీఈటీ సంఘ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న కేజీబీవీ పీఈటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పనివేళల్లో మార్పు చేసి తమకు న్యాయం చేయాలని కస్తూర్బాం గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయానికి ఆనుకుని ఉన్న జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో పీడీ–పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తిలను కలిసి వినతిపత్రం అందజేశారు. కేజీబీవీల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారికి వివరించారు. మహిళా ఉద్యోగుల వ్యక్తిగత భద్రత, కుటుంబ, పిల్లల బాధ్యతల దృష్ట్యా ప్రస్తుత పనివేళలు కాకుండా.. ఉదయం 6 నుంచి 10:30 వరకు, మరళా సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కేజీబీవీ పీఈటీలకు మినిమం టైం స్కేల్ వర్తింపజేసేందుకు కృషి చేయాలని పీఈటీలు పావని, గీత, సునీత, సన్యాసమ్మ, ప్రియాంక, తదితరులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ నాయకులు స్పందిస్తూ ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా.. త్వరలో సమగ్రశిక్షా స్టేట్ పీవోను కలిసి సమస్య వివరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాలల క్రీడల గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎస్.వి.రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో తొలిసారిగా క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు, నిర్వాహకులు

రణస్థలం : ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లో శుక్రవారం మొట్టమొదటి సారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మియామి టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 180 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ మాట్లాడుతూ ఐఐటీ స్థాపించిన తొలినాళ్లలో ఇంజినీరింగ్ విద్యార్థులకు నూజివీడులో తరగతులు నిర్వహించేవారని, అందుకే క్యాంపస్ డ్రైవ్‌లన్నీ అక్కడే జరిగాయని చెప్పారు. తాజాగా ఎచ్చెర్ల క్యాంపస్‌లోనే అన్ని ఇంజినీరింగ్ పీఈయూసీ, క్లాస్‌వర్క్‌లు జరుగుతున్నాయని, అందుకే తొలిసారిగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు వస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. క్యాంపస్ డ్రైవ్ విజయవంతం కావడంలో పరిపాలనాధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, సీఎస్ఈ విభాగాధిపతి రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వరప్రసాద్ కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో మియామి టెక్నాలజీస్ ప్రతినిధులు నవీన్, రవిరామ్ వర్మ, అధ్యాపకులు, విభాగాధిపతులు, సిబ్బంది ప్లేస్‌మెంట్ టీమ్ ప్రతినిధులు వాగ్దేవి, ప్రహర్షిత్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రహదారిద్ర్యం?



అధ్వానంగా ఉన్న బెండి–బెండిగేట్ రోడ్డు



గోతులమయంగా రోడ్డు

తాము అధికారంలోకి వస్తే గతుకుల రోడ్లను అద్దాల్లా మెరిపిస్తామంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు.. తీరా గద్దెనెక్కాక ఆ మాటే మర్చిపోయారు. సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లు సిద్ధం చేస్తామని ప్రగల్భాలు పలికి ఆచరణలో మాత్రం చేతులెత్తేశారు. ఒకటి రెండు పట్టణ రోడ్లు తప్ప గ్రామాల రోడ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో పలు రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. వజ్రపుకొత్తూరు మండలం బెండి గేట్ నుంచి వజ్రపుకొత్తూరు వరకు డబుల్ రోడ్డు, కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి వరకు డబుల్ రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. అడుగుకో గుంత ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోజూ ఇబ్బందులు పడుతున్నా కూటమి పాలకులు కనీసం కన్నెత్తి చూడక పోవడంతో పాలకుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్



పూండిగల్లి వద్ద రోడ్డు దుస్థితి



బెండి దత్తాత్రేయ ఆశ్రమం వద్ద ప్రమాదకరంగా రహదారి

ఆమె నేత్రాలు సజీవం



జయలక్ష్మి(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చంపాగల్లివీధిలో నివాసం ఉంటున్న అంధవరపు జయలక్ష్మి (68) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారుడు అంధవరపు సుబుద్ధి, కోడలు సత్యవతి, జి.లక్ష్మిలు వలసయ్య ద్వారా విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, జగదీష్‌ల ద్వారా జయలక్ష్మి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబరును సంప్రదించవచ్చని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు.. వీడిన గ్రహణం



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

- రెండు నెలల జాప్యం తర్వాత ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ
- మెరిట్, రోస్టర్ ఆధారంగా సీట్లు కేటాయింపు
- కాంట్రాక్ట్ లెక్చరర్లకు రెన్యువల్



తరగతి గదిలో డిగ్రీ విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి సర్కారు ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాల విద్య, ఇంటర్‌విద్య రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనుక్కి అన్న చందంగా తయారైతే.. కళాశాల విద్య (డిగ్రీ విద్య) మాత్రం పూర్తిగా అథఃపాతాళానికి చేరుకుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. మిగతా అన్ని శాఖలపై ఫోకస్ చేస్తూ.. సొంత శాఖను గాలికొదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణే డిగ్రీ ప్రవేశాలు. ఫస్టియర్‌లో మూడు నెలలగా ప్రవేశాలు జరగకపోవడంతో ప్రతిపక్షం, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు, కాలేజీల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర వీడింది. డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను ఇన్ని రోజులు ఉసూరుమనిపించి ఎట్టకేలకు రెన్యువల్స్ చేపట్టాలని నిర్ణయించింది.

రెండింటా దరఖాస్తులు..

డిగ్రీ విద్యా విధానంపై కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. సింగిల్ మేజర్ విధానాన్ని మార్పులు చేస్తామంటూ.. నానా హడావుడి చేసి మరళా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానానికే జై కొట్టింది. పాతవిధానమైన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలుగా దరఖాస్తులు చేసుకోవచ్చని నిర్ణయించింది. ఓఏపీఎండీసీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో, ఎలాగే ఎంచుకున్న కళాశాలను నేరుగా సంప్రదించి ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు సమర్పించే సమయంలో కచ్చితంగా ఆధార్ అథంటిఫికేషన్ తీసుకోవాలని సూచించారు. ఏ విధంగా దరఖాస్తు చేసినా.. మెరిట్, రోస్టర్ ఆధారంగా సీట్లు భర్తీ చేయాల్సిందేనని పేర్కొంది. నిర్దేశిత షెడ్యూల్ ఒకటి రెండు రోజుల్లో వెలువడనుంది.

ఎట్టకేలకు రెన్యువల్స్..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల(సీఎల్స్)కు ఇన్నిరోజులూ నిరీక్షణకు గురిచేసి.. ఎట్టకేలకు వారికి రెన్యువల్స్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జోన్–1 పరిధిలో పనిచేస్తున్న సీఎల్స్‌కు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్ వెల్లడించారు. జిల్లాలో 66 పోస్టులను గతంలో పనిచేసిన కాంట్రాక్ట్ లెక్చరర్లతోనే భర్తీ చేయనున్నారు.

21 నుంచి 23 వరకు కౌన్సెలింగ్..

- 2025–2026 విద్యా సంవత్సరానికి జోన్–1 పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన గత విద్యా సంవత్సరం ఆఖరి పనిదినం ఏప్రిల్ 30, 2025 నాటికి పనిచేస్తున్న సీఎల్స్ రెన్యువల్స్‌కు దరఖాస్తులు చేసుకోవాలని శ్రీకాకుళం ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు పేర్కొన్నారు.
- రెన్యువల్ కోసం ఈనెల 19న సాయంత్రం 5 గంటల్లోపు వారు పనిచేస్తున్న కాలేజీలో ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.
- ప్రిన్సిపాళ్లు కౌంటర్ సైన్ చేసి దరఖాస్తులను ఈ నెల 20వ తేదీన సాయంత్రం 4 గంటల్లోగా ఐడీ కళాశాల (జీసీడీ మెన్ శ్రీకాకుళం) ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుంది.
- ఈ నెల 21 నుంచి 23వ తేదీల్లో (ఏదో ఒకరోజు) కాంట్రాక్ట్ లెక్చరర్లకు రెన్యువల్ కోసం ఎంపికచేసిన జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

దరఖాస్తులు చేసుకోండి..



డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు విధానాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రవేశాల్లో కాస్త జాప్యం జరిగినమాట వాస్తవమే. దీనిని ఆసరా చేసుకుని ప్రైవేటు కాలేజీలు ఒకింత లాభపడి ఉండొచ్చు. కానీ ప్రభుత్వ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థుల్లో ఆసక్తి బలంగా ఉంది. కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్స్‌పైనా ఉత్తర్వులు వెలువడ్డాయి. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నియామకాలు, కౌన్సెలింగ్ పూర్తిచేస్తాం.

– డాక్టర్ కణితి శ్రీరాములు, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఐడీ కళాశాల) ప్రిన్సిపాల్

పలాస ఎమ్మెల్యే తీరు సరికాదు



సమావేశంలో పాల్గొన్న బాధిత రైతులు, ఉద్యమనేతలు

మందస: ఉద్దానంలో ఎలాగైనా కార్గో ఎయిర్‌పోర్టు నిర్మించి తీరుతానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాఖ్యానించడం సరికాదని కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి ఇరోతు కృష్ణారావు అన్నారు. శుక్రవారం మందస మండలం బిడిమి గ్రామంలో జుత్తు జగన్నాయకులు సంఘ భవనంలో కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా తమ భూములపైకి వస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే శిరీష ఇప్పటికైనా పచ్చని ఉద్దానంలోని 16 గ్రామాల రైతుల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు. సమావేశంలో రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, చీపురుపల్లి సర్పంచ్ జోగి అప్పారావు, బత్తిన లక్ష్మణరావు, దున్న హరికృష్ణ, తెప్పల కృష్ణారావు, జుత్తు కోటేశ్వరరావు, జుత్తు ధర్మారావు, జుత్తు లోకనాథం, దున్న రామారావు, మహాలక్ష్మి, లచ్చయ్య, గన్నయ్య, రాజు, మర్ల సంతోష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్లు



శ్రీకాకుళం ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లాలో వివిధ ప్రభుత్వ ఐటీఐల్లో ఖాళీగా ఉన్న కోర్సులు/ట్రేడులు భర్తీకి అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంగతి అటుంచితే.. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్నవారు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కౌన్సెలింగ్‌కు ముందు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తప్పనిసరని తెలిపారు. మొదటి విడతలో అవకాశం లభించని విద్యార్థులు, కొత్తగా ఐటీఐల్లో చేరగోరే వారు ఈనెల 20వలోగా ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రెండో విడత అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఆప్షన్ ఇచ్చిన ఐటీఐ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీకాకుళం ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐకి దరఖాస్తులు చేసుకున్నవారు వారి విద్యార్హత పత్రాల పరిశీలన (వెరిఫికేషన్) విధిగా చేసుకోవాల్సి ఉంటుందని డీఎల్‌టీసీ ఏడీ యండ రామమోహనరావు చెబుతున్నారు. 192 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు.

23న కౌన్సెలింగ్..

ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులకు ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఐటీఐ కేంద్రాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. శ్రీకాకుళం డీఎల్‌టీసీలో సైతం మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా బ్యూటీషియన్–డిజైనింగ్ పేరిట కోర్సు అందుబాటులో ఉందని రామమోహనరావు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే అభ్యర్థులు వారివారి ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు వాటి జిరాక్స్‌కాపీలను సైతం తమ వెంట తీసుకురావాలని సూచిస్తున్నారు. వివరాలకు 9505161701, 9963945259, 9885960809 నంబర్లను సంప్రదించవచ్చు.

వేర్వేరు చోట్ల చోరీలు



జె.ఆర్.పురంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి, క్లూస్ టీం సభ్యులు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో బంగారం షాపు నిర్వహిస్తున్న లెంక దిలీప్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దిలీప్ తన పిల్లలను చదువు నిమిత్తం శ్రీకాకుళంలోనూ ఇల్లు తీసుకుని అక్కడికి వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలో క్రమంలో గురువారం శ్రీకాకుళం వెళ్లిన దిలీప్ శుక్రవారం జె.ఆర్.పురంలో ఉన్న ఇంటికి వెళ్లగా తలుపుల తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. వెంటనే జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి వెండి, బంగారం ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. క్లూస్ టీం సభ్యులు ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలి శ్రీనివాసనగర్‌లో..

టెక్కలి రూరల్: స్థానిక శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఏపీఎస్‌పీ ఏఎస్‌ఐ నర్సింహమూర్తి ఇంట్లో చోరి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్ పిల్లలబంద చెరువు సమీపంలో నివాసముంటున్న నర్సింహమూర్తి నెలరోజుల క్రితం హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యజమాని నర్సింహమూర్తి హైదరాబాద్ నుంచి శనివారం వస్తున్నారని, ఆయన వచ్చాకే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి రవాణా గుట్టురట్టు

నరసన్నపేట: ఒడిశా నుంచి చెన్నైకి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నరసన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది గురువారం సోదాలు నిర్వహిస్తుండగా గంజాం జిల్లా సింగిపూర్ గ్రామానికి చెందిన అజిత్‌కుమార్ నాయక్, దేవేంద్ర ప్రధాన్‌లు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా మూడు ప్యాకెట్లలో 18.750 కేజీల గంజాయి గుర్తించారు. గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

13 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి ముంబైకి 13 కిలోల గంజాయి తరలిస్తున్న సునీల పాయక, మహన్ నాయక్‌తో పాటు మరో బాల నేరస్తుడిని అరెస్టు చేసినట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణ ఎస్‌ఐ ముకుందరావు, సిబ్బంది రైల్వేస్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించగా వీరంతా అనుమానాస్పద స్థితిలో కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారణ చేయగా 13 కిలోల గంజాయి పట్టుబడింది. వీరిని అరెస్టు చేసి బైక్, మూడు ఫోన్లు సీజ్ చేశారు.



ఇచ్ఛాపురం టౌన్ : పోలీసుల అదుపులో నిందితులు

డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ధర్నా

- పాత పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర ప్రభుత్వ మెమో 57 మేరకు డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. డీఎస్సీ–2003 ఫోరం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ 2003 డీఎస్సీ నియామకాలు 2004 సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందే పూర్తయ్యాయని, ప్రభుత్వ విధానాల వల్ల పోస్టింగులు ఆలస్యమయ్యాయని చెప్పారు. ఇదే తరహాలో నష్టపోయిన హోంశాఖ, గ్రూప్–1, గ్రూప్– ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం న్యాయం చేస్తోందని, తమకు కూడా పాత పెన్షన్ వర్తింపచేసి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి తెలియజేసినా స్పందన లేదన్నారు. కుటుంబ భవిష్యత్తు, న్యాయంగా రావాల్సిన పాత పెన్షన్ సాధించుకోవడానికి నిరసన ప్రదర్శన చేపట్టాల్సి వచ్చిందని, ప్రభుత్వం ఇప్పటికై నా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ముగ్గురు ఐఏఎస్‌లకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ మంజూరు చేస్తూ... దిగు స్థాయి ఉద్యోగులమైన తమకు మాత్రం పాత పెన్షన్ మంజూరు చేయకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. తమను బలవంతంగా సీపీఎస్ విధానంలోకి నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసన దీక్షలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్‌మూర్తి, తమ్మినేని ఆనందరావు, సత్యనారాయణ, పప్పల రాజశేఖర్, కరిమి రాజేశ్వరరావు, గండేపల్లి మల్లేశ్వరరావు, సోమేశ్వరరావు, సీర రమేశ్, పడాల ప్రతాప్, శారద, పంచాది గోవిందరావు, కోర్ కమిటీ సభ్యులు జి.భాస్కరరావు, జి.చిన్నకృష్ణంనాయుడు, డి.శివరాంప్రసాద్, కె.ప్రకాష్, పి.శ్రీకర్, ఎ.లక్ష్మణ్, ఎ.తిరుమలేశ్వరరావు, టార్జాన్ బాబు, రామకృష్ణ, అనిల్‌బాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా శంకరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాకు చెందిన రౌతు శంకరరావు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సంఘం మహాసభలో జాతీయ అధ్యక్షుడు లాక వెంగలరావు యాదవ్, జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారం అహిర్‌లు నియామక పత్రం అందజేశారు.

పట్టుబడిన కాపర్ దొంగ!

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో పలుప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న బిల్డింగ్‌ల వద్ద లక్షలు విలువ చేసే వైరులోని కాపర్‌ను దొంగిలించిన వ్యక్తి రెండో పట్టణ పోలీసుల అదుపులో ఉన్నాడని విశ్వసనీయ సమాచారం. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడుకు చెందిన నిందితుడు ముందుగా హైదరాబాద్‌లో ఉండేవాడని.. జల్సాలకు అలవాటు పడి 2017, 2018, 2023లో ఇళ్లల్లో తలుపులు పగులగొట్టి చోరీలకు పాల్పడేవాడని, రెండో పట్టణ పోలీసులకు అప్పట్లో పట్టుబడినట్లు తెలిసింది. విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.


పేకాట శిబిరంపై దాడులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని జెడ్పీ వెనుక గల కామేశ్వరి కల్యాణ మండపం సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఐ కృష్ణమూర్తి నేతృత్వంలో దాడులు నిర్వహించగా ఐదుగురు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.46,970 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో బి.గోవింద, బి.ప్రసాద్, ఎస్.కె.ఆలీ, ఎం.మోహనకృష్ణ, ఎం.రాజశేఖర్ ఉన్నారు. వీరి వద్ద నుంచి ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

తోపుడుబళ్ల వ్యాపారులకు నోటీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని 50కు పైగా తోపుడు బండ్ల వ్యాపారులకు ట్రాఫిక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శబ్దకాలుష్య నివారణ మొదటి హెచ్చరికలో భాగంగా నోటీసులిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు శుక్రవారం తెలిపారు. మైక్ ద్వారా నిరంతరం శబ్దాలు చేస్తుండటంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నోటీసులు ఇచ్చామని, మరోసారి ఇలా చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు.

దేవాదికి దేవుడే దిక్కు!



నరసన్నపేట మండలంలో సుమారు రెండు వేల ఎకరాలకు సాగు నీరందించే 8 ఆర్ దేవాది చానల్ పూడికలతో నిండిపోయింది. ఇతర కాలువల్లో పూడికలు తొలగిస్తున్నా దేవాదిని మాత్రం పట్టించుకోకపోవడంపై పరిసర ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాలువ మొత్తం తుప్పలతో నిండిపోవడంతో దూకులపాడు నుంచి గోకయ్యవలస మీదుగా శివారు భూములకు నీరు వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – నరసన్నపేట